క్లుప్తంగా

విద్యార్థులు కష్టపడి చదవాలి



ఆర్మూర్‌టౌన్‌: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని భీమ్‌గల్‌ మున్సిపల్‌ మాజీ కో– ఆప్షన్‌ సభ్యులు అజ్మతుల్లా అన్నారు. ఆదివారం ఆర్మూర్‌ పట్టణంలోని జమాత్‌–ఎ–ఇస్లామీ హింద్‌ కార్యాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన 20 మంది విద్యార్థులకు యూనిఫాంలు, ఇద్దరు అర్హులైన మహిళలకు జమాత్‌–ఎ–ఇస్లామీ హింద్‌ ఆర్మూర్‌ శాఖ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రుల పేరును నిలపాలన్నారు.

విద్యానగర్‌లో స్వచ్ఛ భారత్‌



పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మహాలక్ష్మీ కాలనీ, విద్యానగర్‌ కాలనీలో ఆదివారం మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు కాలనీల్లో మురికి కాలువలు శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో 16 వారాలుగా మున్సిపల్‌ పరిధిలోని 36 వార్డుల్లో స్వచ్ఛ భారత్‌ చేపడుతున్నట్లు తెలిపారు. విద్యానగర్‌ కాలనీ కమిటీ అధ్యక్షుడు ఉమ్మెడ సాయన్న, సంస్థ సభ్యులు సుంకె మణికాంత్‌, వేద రాజ్‌ కుమార్‌, గణేష్‌, జంగిడి భోజన్న, మధుసూదన్‌, నరేందర్‌, ఎల్లయ్య, నూకల ఆదిత్య, శ్యాం సుందర్‌ తదితరులు పాల్గొన్నారు.

శక్తికి శాకాహారమే సరైన ఆహారం



పెర్కిట్‌(ఆర్మూర్‌): మానవుల శక్తికి ముక్తికి శాకాహారమే సరైన ఆహారమని పిరమిడ్‌ స్పిరిచువల్‌ సొసైటీ మూవ్‌మెంట్‌ జిల్లా అధ్యక్షుడు సాయి కృష్ణారెడ్డి అన్నారు. ఆర్మూర్‌ మండలం ఇస్సాపల్లిలో ఆదివారం పీఎస్‌ఎస్‌ఎం ఆధ్వర్యంలో అహింసాయుత మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శాకాహారాన్ని భుజిస్తూ సనాతన ధర్మాన్ని రక్షించుకోవాలన్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌ ఇస్సాపల్లి రాజిరెడ్డి, డాక్టర్‌ అమరవాజీ శ్రీనివాస్‌, ఉమ్మెడ చిన్నయ్య, సుదర్శన్‌, రాజు, ఒడ్డెన్న యాదవ్‌, ప్రశాంత్‌ రెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో ఘనంగా మ్యారేజ్‌ సండే



బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని రాకాసిపేట్‌ హోలీ ట్రినిటీ చర్చిలో మెదక్‌ డయాసిస్‌ ఆధ్వర్యంలో మ్యారేజ్‌ సండే నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పెళ్లయిన జంటలు పూల దండలు మార్చుకోగా చర్చి ఫాదర్‌ రెవరెండ్‌ రూబెన్‌ వారిని ఆశీర్వదించారు. అనంతరం చర్చి ఫాదర్‌ మాట్లాడారు. రెవరెండ్‌ ప్రకాష్‌, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించారు.. అప్రోచ్‌ మరిచారు

- ప్రమాదకరంగా మారిన జలంలం–సాటాపూర్‌ రోడ్డు
- నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం



రెంజల్‌ సమీపంలోని మొండివాగు వంతెన అప్రోచ్‌ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

రెంజల్‌(బోధన్‌): అధికారులు, పాలకుల పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల భారిన పడుతున్నారు. ఈ రోడ్డు ప్రమాదకరంగా ఉన్నట్లు మండల, జిల్లా స్థాయి అధికారులు గుర్తించినా నిర్లక్ష్యం వహిస్తున్నారు. 9 సంవత్సరాలుగా ప్రయాణికులు వంతెనపై ప్రయాణించి ప్రమాదాలను కోరి తెచ్చుకుంటున్నారు. రెంజల్‌ శివారులోని మొండివాగుపై లోలెవల్‌ వంతెన స్థానంలో హైలెవల్‌ వంతెన నిర్మాణానికి 2016లో కేంద్ర ప్రభుత్వం నాబార్డు నుండి రూ. 3.5 కోట్లను మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్‌ ఒప్పందం మేరకు నిర్మాణ పనులను పూర్తి చేశారు. వంతెనకు రెండు వైపులా అప్రోచ్‌ రోడ్డును నిర్మించకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు వంతెనకు ఇరు వైపులా ఉన్న మొరం రోడ్డు గుంతలమయంగా మారింది. కనీసం మట్టితో భర్తీ చేయాల్సిన అధికారులు, పాలకులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు రావాల్సిన అధికారులు, సిబ్బందితో పాటు పలువురు ఈ రోడ్డుపై రాకపోకలు మానుకుని దూపల్లిగేట్‌, నవీపేట్‌, పెగడాపల్లి రహదారుల మీదుగా రెంజల్‌కు చేరుకుంటున్నారు.

నిత్యం ప్రమాదాలు

ఈ రోడ్డు మీదుగా సమీప గ్రామాలకు వెళ్లాల్సిన వారు మాత్రమే రాకపోకలను సాగిస్తూ నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. 8 నెలల కిందట రెంజల్‌ పోస్టాఫీసులో పని చేస్తున్న ఉద్యోగి నిజామాబాద్‌ నుంచి ఈ దారి వెంట రెంజల్‌కు వస్తుండగా గుంతలు గుర్తించక అదుపుతప్పి వాగులో కారుతో సహా పడిపోయాడు. కాస్త ప్రమాదాలతో ఆయన బయటపడగా కారు మాత్రం ధ్వంసమైంది. వారం రోజుల కిందట ద్విచక్ర వాహనదారులు పడి గాయాలపాలవగా అటుగా వస్తున్న రెంజల్‌ ఎస్సై చంద్రమోహన్‌ వెంటనే స్పందించి 108కు ఫోన్‌ చేసి సకాలంలో రప్పించడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. వంతెనకు ఇరు వైపులా వాహనాలను నడపాలంటే సర్కస్‌ ఫీట్లు చేయాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి అప్రోచ్‌ పనులు పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలకు అధికారులే బాధ్యులు



ప్రజల ప్రమాదాలకు అధికారులే బాధ్యులు. వారి నిర్లక్ష్యం వల్లే వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. సుమారు 200 మీటర్ల రోడ్డుకు కనీసం సంబంధిత శాఖ అధికారులు అప్పుడప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు. అధికారులు స్పందించకుంటే కలెక్టర్‌ను కలిసి త్వరలో ఫిర్యాదు చేస్తాం. వర్షాకాలంలో గుంతలపై వర్షపు నీరు నిండి ఉండటంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. – తిరుపతి బుజ్జి, రెంజల్‌

ప్రతిపాదనలు పంపాను

2021 నుంచి ఇప్పటి వరకు రెండు సార్లు ప్రతిపాదనలు పంపాను. టెండర్లు వేసినా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. తాజాగా ఇటీవలనే జలంలం–సాటాపూర్‌ రోడ్డుకు 3వ పర్యాయం అప్రోచ్‌ రోడ్డుపై బీటీ నిర్మాణ పనులకు రూ.65 లక్షలతో ప్రతిపాదనలు పంపాను. టెండరు ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుంది. ప్రమాదాలు జరుగుతున్నట్లు ఇప్పటి వరకు ఫిర్యాదులు రాలేదు. వస్తే తాత్కాలిక పనులు చేయిస్తా.

– మోహన్‌, ఆర్‌అండ్‌బీ డీఈఈ

అధ్వానంగా తల్వేద- నాళేశ్వర్‌ రోడ్డు



బీటీ తేలిపోయి గుంతలమయంగా మారిన తల్వేద-నాళేశ్వర్‌ రోడ్డు



మట్టి పోసిన గుంత

నందిపేట్‌(ఆర్మూర్‌): నందిపేట మండలం తల్వేద, నవీపేట మండల నాళేశ్వర గ్రామాల మధ్య గల రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షాలకు ఈ రోడ్డులో 10 మీటర్లకు ఓ గుంత ఏర్పడింది. ఈ రోడ్డు గుండా నందిపేట మండలంలోని పలు గ్రామాల నుంచే కాకుండా ఇతర మండలాలకు చెందిన ప్రజలు ప్రయాణ దూరం కలిసి వస్తుందని బైంసా, బాసర, ముదోల్‌, మహారాష్ట్రలోని పలు గ్రామాలకు ప్రయాణం సాగిస్తుంటారు. ప్రయాణం సాగించేవారు రాత్రివేళలో కొంచెం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంది. వర్షాలకు రోడ్డు ప్రమాదకరంగా మారి సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు గాని, నాయకులు గాని పట్టించుకోవడం లేదు. తూతూ మంత్రంగా కోతకు గురైన ప్రాంతంలో, గుంతలతో మట్టి పోసి వదిలేశారు. నాయకులు, అధికారులు చొరవ తీసుకుని మరమ్మతులు చేపట్టి స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

‘లైన్‌మన్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు’



సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లిలో వ్యవసాయ విద్యుత్‌ నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న లైన్‌మన్లతో మాకు ప్రయోజనం లేదని రైతులు తేల్చి చెబుతున్నారు. మామిడిపల్లిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రైతులు మాట్లాడుతూ.. గ్రామంలో 200 ఎకరాల సాగు విస్తీర్ణానికి ముగ్గురు లైన్‌మన్లు ఉండాల్సిన చోట ప్రస్తుతం ఇద్దరే ఉన్నారని ఇద్దరిలో ఒకరు ఎప్పుడూ సెలవులో ఉండడం వల్ల సమస్య వచ్చినపుడు పరిష్కారం లభించడం లేదన్నారు. సమస్య తలెత్తినపుడు లైన్‌మన్లకు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా స్పందించడం లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్‌ లేకపోవడంతో తరచూ బ్రేక్‌ డౌన్‌ అవుతున్నాయన్నారు. అలాగే ఇంటర్‌ పోల్స్‌ లేకపోవడంతో విద్యుత్‌ తీగలు గాలికి ఊగి ఫ్యూజులు పోవడం, మోటార్లు కాలిపోవడం జరుగుతోందన్నారు. ఇన్ని జరుగుతున్నా లైన్‌మెన్లు పట్టించుకోవడం లేదన్నారు. లైన్‌మన్ల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఈ కారణంగా పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకపోతే పెర్కిట్‌ సబ్‌ స్టేషన్‌ ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. రైతులు లక్కారం తవ్వన్న, లక్కారం సాగర్‌, దొన్కంటి సత్యనారాయణ, సాయిరెడ్డి, లక్కారం నర్సారెడ్డి, మల్యాల పోశెట్టి, ఆకుల నడిపి రాజన్న పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని తహసీల్‌ కార్యాలయం ఆవరణలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆర్మూర్‌ డివిజన్‌ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏ.రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జ్ఞానేశ్వర్‌, ఫైనాన్స్‌ సెక్రెటరీగా నవజీవన్‌, అసోసియేట్‌ అధ్యక్షుడిగా గంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా కోటేశ్వర్‌, సుధాకర్‌లు, సంయుక్త కార్యదర్శిగా గంగాధర్‌, పబ్లిసిటీ సెక్రెటరీగా జిందం నరహరి, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీగా హరినారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అంకితభావంతో సేవలందిస్తామన్నారు. ఎన్నికైన వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మామిడ్యాల రవీందర్‌, ప్రధాన కార్యదర్శి భోజాగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు మేడపాటి ప్రకాష్‌ రెడ్డి, వడ్డీ మోహన్‌ రెడ్డి

బోధన్‌రూరల్‌: మండలంలోని అమ్దాపూర్‌, మీనార్‌పల్లి, రాంపూర్‌ గ్రామాల్లో ఎంపీ ల్యాడ్స్‌ నిధులతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనుల కోసం ఎంపీ అరవింద్‌ నిధులు మంజూరు చేయించగా ఆదివారం ఆయా గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌ రెడ్డి, వడ్డీ మోహన్‌ రెడ్డిలు స్థానిక నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. నియోజకవర్గ కన్వీనర్‌ శ్రీధర్‌, మండలాధ్యక్షుడు సిర్ప సుదర్శన్‌, పట్టణాధ్యక్షుడు గోపి, సాలూర మండలాధ్యక్షుడు గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.

‘ఎత్తిపోతల’ నిర్వహణకు నూతన కమిటీ



సమావేశమైన సాలూర గ్రామ రైతులు

బోధన్‌: సాలూర మండల కేంద్రంలోని మంజీర నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం నిర్వహణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్‌ ఆఫీస్‌ ఆవరణలో రైతులు సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా సొసైటీ మాజీ చైర్మన్‌ బాసర శివకాంత్‌ పటేల్‌, ఉపాధ్యక్షుడిగా ఇల్తెపు సాయన్న, కార్యదర్శిగా సరిడే సాయిలు, కోశాధికారిగా మామిడి శ్రీను, సభ్యులుగా ముట్టిన్‌ గంగారాం, శ్రీకాంత్‌, సంగెం భూమయ్య, ఎంఏ ఖదీర్‌, గంటే లక్ష్మణ్‌, మల్లెపూల లక్ష్మణ్‌, సీరడి నగేష్‌, కోటగిరి లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు.

జై కిసాన్‌ మున్నూరు కాపు సంఘం ఏకగ్రీవ ఎన్నిక

రుద్రూర్‌: మండల కేంద్రంలోని జై కిసాన్‌ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి పార్వతి శేఖర్‌ తెలిపారు. అధ్యక్షుడిగా కర్క అశోక్‌, ఉపాధ్యక్షులుగా గుర్ల గోపి, పార్వతి ప్రవీణ్‌ కుమార్‌, సహాయ కార్యదర్శులుగా పి.రోహిత్‌, డి.రవి, గౌరవ సలహాదారులుగా పత్తి రాము, ఉప్పు గంగాధర్‌, నాగం అశోక్‌, దుర్కి సాయన్న, పార్వతి మురళి, పి. రాములను ఎన్నుకున్నట్లు వివరించారు.

ఎక్కడ వేసిన చెత్త అక్కడే ?



శక్కర్‌ కాలనీలోని ఖాళీ ప్రదేశంలో వేసిన చెత్త

బోధన్‌టౌన్‌(బోధన్‌): పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అధికారులు చెబుతున్నా.. మాటలు ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. బోధన్‌ బల్దియా పరిధిలో 38 వార్డులు ఉన్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ కోసం 8 జోన్‌లుగా విభజించి వార్డుకో జవాన్‌ను ఏర్పాటు చేశారు. బల్దియా పరిధిలో ప్రతి రోజూ పారిశుద్ధ్య కార్మికులు ప్రతి వార్డులో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తారు. గడిచిన రెండు మూడు రోజులుగా చెత్త సేకరణ పూర్తి స్థాయిలో చేయకపోవడం వల్ల కాలనీల ప్రజలు చెత్తను ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారు. దీంతో దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువవుతుంది. ఇప్పటికైనా బల్దియా అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించి ప్రతిరోజూ చెత్తసేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సమాచారం

■ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

వేల్పూర్‌/బాల్కొండ: వేల్పూర్‌, బాల్కొండ మండలాల్లో ఈ ఏడాది జూన్‌ 5 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా కోసం సంబంధిత ఏఈవోల వద్ద ఈ నెల 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఏవోలు శృతి, బద్దం లావణ్యలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేగాక గతంలో రైతు బీమా కోసం దరఖాస్తు చేసిన రైతులు వారి నామినీ మార్చుకోవాలనుకుంటే ఈనెల 12 లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సున్న రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

■ నేడు ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి పర్యటన

బోధన్‌: సాలూర మండలంలోని మందర్న, హున్స గ్రామాల్లో సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌ రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మందర్నాలో ఉదయం 9.30 గంటలకు హనుమాన్‌ మందిర పునర్నిర్మాణం, అంగన్‌వాడి కేంద్రం నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేయనున్నారని కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు, హున్స సొసైటీ చైర్మన్‌ మందర్నా రవి ఆదివారం తెలిపారు. హున్సా మండల పరిషత్‌ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. అనంతరం ఈ గ్రామంలో హున్స, మందర్న, ఖాజాపూర్‌ గ్రామాల రైతులతో ముఖాముఖీగా మాట్లాడనున్నారని పేర్కొన్నారు.

■ శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆదివాసి యువతను ప్రోత్సహించాలి



పెర్కిట్‌లో భీమన్న గుడి వద్ద సమావేశమైన ఆదివాసి నాయక్‌పోడు సంఘం సభ్యులు

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆదివాసీ నాయక్‌పోడు కులస్తులందరు తమ కులానికి చెందిన యువతను విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రోత్సహించడానికి ఐక్యంగా ఉండాలని ఆదివాసి నాయక్‌పోడు జిల్లా గౌరవ అధ్యక్షుడు బంగారు భోజన్న, ఉద్యోగుల సేవా సంఘం ముఖ్య సలహాదారుడు జెడ్పీ డిప్యూటీ సీఈవో సాయన్న పిలుపునిచ్చారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌ భీమన్న గుడి వద్ద ఆదివారం ఆదివాసీ నాయక్‌పోడు సంఘం సభ్యులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉన్నత విద్య చదివే ఆదివాసి విద్యార్థుల కోసం అంబేడ్కర్‌ ఓవర్సీస్‌ విద్యా నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చైతన్య పరచాలన్నారు. నేతలు గడ్డం శంకర్‌, కందు రాజేశ్వర్‌, గాండ్ల రాంచందర్‌, పుట రాజేశ్వర్‌, కొసెడుగు రవి, కొండ్రు నవీన్‌ పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో గల నాగేలింగేశ్వర ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, జంట నాగుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం నుంచి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. అనంతరం శివాలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు భారీగా హాజరై అన్నదాన ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు సత్య శ్రీనివాస్‌, అంబికా రమేష్‌, రాజయ్య, కలిగోట గంగాధర్‌, బాలోజీ, రెడ్డి ప్రకాష్‌, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ప్రజలకు అందేలా చూడాలి

- టీపీజేపీ నాయకులు డాక్టర్‌ రవీంద్రనాథ్‌ సూరి



మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌ సూరి

ఆర్మూర్‌: విద్య, వైద్యం ప్రజలకు అందించడం ప్రభుత్వాల బాధ్యత అని టీపీజేపీ నాయకులు డాక్టర్‌ రవీంద్రనాథ్‌ సూరి అన్నారు. ఆర్మూర్‌ పట్టణంలోని కుమార్‌ నారాయణ భవన్‌లో ఏఐయూకేఎస్‌, ఏఐపీకేఎంఎస్‌, టీయూసీఐ, పీవైఎల్‌, పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ తదితర విప్లవ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్య, వైద్యం ప్రజలకు అందించడం ప్రభుత్వాల బాధ్యత అన్న అంశంపై రౌండ్‌ టేబుల్‌ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఏఐయూకేఎస్‌ జిల్లా అధ్యక్షుడు ఎస్‌.సురేష్‌ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్యాన్ని గ్రామీణులకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు వైద్యం అందక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐకేయూఎస్‌ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ప్రభాకర్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లల్లో నిధులు పెంచాల్సింది పోయి తగ్గిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏఐపీకేఎంఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, ఏఐయూకేఎస్‌ రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం, టీయూసీఐ కార్యదర్శి ఎం.ముత్తెన్న, పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.గోదావరి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్‌.అనిల్‌ కుమార్‌, రాజకీయ పార్టీలు, దళిత ప్రజాసంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్‌ సావెల్‌ గంగాధర్‌ ప్రసంగించారు. నాయకులు కె.రాజేశ్వర్‌, ఏ.ప్రకాష్‌, వి.సత్తెవ్వ, బి.బాబన్న, ఆర్‌.దామోదర్‌, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై బల్దియా ప్రత్యేక దృష్టి



బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ బల్దియా అధికారులు ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించారు. బల్దియాకు నెలకు వచ్చే ఆదాయం రూ.27 లక్షలు ఉండగా ఖర్చు రూ.50 లక్షల పైచిలుకు అవుతుంది. దీంతో అధికారులు బల్దియాకు ఆదాయం సమకూరే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే బల్దియా పరిధిలో ఏర్పాటు చేసుకున్న వ్యాపార, వాణిజ్య సంస్థలు తీసుకోవాల్సిన ట్రేడ్‌ లైసెన్స్‌లపై దృష్టి సారించారు. పట్టణ పరిధిలో దుకాణ సముదాయాలు 3 వేలు, ప్రైవేట్‌ ఆస్పత్రులు 30, ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలలు 40 వరకు ఉన్నాయి. పట్టణంలో 3 వేల దుకాణ సముదాయాలు ఉండగా ఇప్పటికి 1,800 వరకు ట్రేడ్‌ లైసెన్స్‌లు ఇప్పటికే తీసుకున్నారు. మిగితా 1,200 దుకాణాలకు ట్రేడ్‌ లైసెన్స్‌లు లేనట్లు బల్దియా అధికారులు గుర్తించారు. 1,200 దుకాణ యజమానులకు ఇప్పటికే ట్రేడ్‌ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. దీంతో పాటు యూజర్‌ చార్జెస్‌ దుకాణానికి రూ.100 చొప్పున వసూలు చేసే ఆలోచనలో ఉన్నారు. పూర్తి స్థాయిలో ట్రేడ్‌ లైసెన్స్‌లు తీసుకొని ప్రతీ యేటా రెన్యువల్‌ చేసుకుంటూ పోతే బల్దియాకు ఆదాయం సమకూరుతుంది.

దీంతో పాటు పట్టణంలోని ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలలు తీసుకోవాల్సిన సానిటరీ సర్టిఫికెట్‌పై దృష్టి సారించి ముందుకు సాగుతున్నారు. అయితే ఇప్పటికే దాదాపు పట్టణంలో ఉన్న ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలలు సానిటరీ సర్టిఫికెట్‌ తీసుకున్నాయని, తీసుకోవాల్సిన పాఠశా ల, కళాశాల యాజమాన్యాలు తప్పనిసరిగా తీసుకోవాలని లేని పక్షంలో బల్దియా అందించే సేవలను అందించబోమని చెబుతున్నారు. అలాగే బల్ది యా పరిధిలోగల 17,500 ఇళ్ల నుంచి యూజర్‌ చార్జెస్‌ ప్రతీ నెలా రూ.100 వసూలు చేస్తే బల్దియా కు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు.

భువన్‌ సర్వే..

ఇప్పటికే పట్టణంలోని ఇళ్లు, దుకాణ సముదాయాలు, వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి భువన్‌ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో గతంలో ఉన్న ఇళ్ల కొలతలు, వ్యాపార వాణిజ్య సంస్థల కొలతలు ఇప్పటికీ అలానే ఉన్నాయా, లేక మార్పులు చేర్పులు చేశారా అని వివరాలు సేకరిస్తున్నారు. చేసిన సర్వేలో ఇళ్ల, వ్యాపార సముదాయాల కొలతలు మారితే, మారిన కొలతల ఆధారంగా ఇళ్లకు ఆస్తి పన్ను పెరుగుతుంది. దుకాణ సముదాయాలకు ట్రేడ్‌ లైసెన్స్‌ ఫీజు పెరుగుతుంది.

కళాకారులను ప్రభుత్వం గుర్తించాలి

నిజామాబాద్‌ రూరల్‌: జిల్లాలోని అన్ని రకాల కళాకారులను ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిజామాబాద్‌ సాంస్కృతిక కళావేదిక నాయకులు సిర్ప లింగయ్య పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్‌ భవనంలో ఆదివారం నిజామాబాద్‌ సాంస్కృతిక కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అన్ని రకాల కళాకారుల సహకారం ఎంతో ఉందన్నారు. కళ అన్నది ఒక ప్రత్యేక నైపుణ్యమని అన్నారు. అనేకమంది కళాకారులు ఉపాధి లేక, అనేక సమస్యలతో బాధపడుతున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం వేదిక కృషి చేస్తుందన్నారు. కళాకారులకు కనీస పెన్షన్‌ రూ. పదివేలు ఇవ్వాలని, హెల్త్‌ కార్డులు మంజూరు చేయాలని, పేద కళాకారులకు ఇళ్లు నిర్మించాలని, కళాకారుల పిల్లలకు విద్యా సంస్థల్లో ప్రత్యేక అవకాశం కల్పించాలని కోరారు. కళాకారులకు వాయిద్యాలను ఉచితంగా, సబ్సిడీతో ఇవ్వాలన్నారు. సమావేశంలో కళాకారులు దాసు, చరణ్‌, చంద్రకళ, మధుసూదన్‌ గౌడ్‌, రాధా కిషన్‌, నర్సారెడ్డి, సాయిరెడ్డి, పోశెట్టి, సారారం కృష్ణ, తడకలపల్లి రాజిరెడ్డి, డప్పు గంగారాం, చాంద్‌ పాషా, మోషన్‌, శంకర్‌ గౌడ్‌, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.